# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **తిరుమలలో నూతన వసతి సముదాయాన్ని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.**
2. **రాజధాని అమరావతిలో నూతన భవనాలను అందుబాటులోకి తెస్తున్నామని శాసన సభాపతి సి హెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.**
3. **రాష్ట్రంలో నూతన వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల నిర్మాణానికి చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు.**
4. **పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఈరోజు అంత్యోదయ దివస్‌గా నిర్వహిస్తున్నారు.**

==========================

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉదయం దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద వారికి వేదపండితులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ వారికి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి ప్రారంభించారు. భక్తుల కోసం కొత్తగా నిర్మించిన వెంకటాద్రి నిలయం యాత్రికుల భవన సముదాయాన్ని ఉపరాష్ట్రపతి ప్రారంభించగా.. దేవస్థానం కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్నిముఖ్యమంత్రి ప్రారంభించారు.

-------------------------

రాజధాని అమరావతిలో నూతన భవనాలను అందుబాటులోకి తెస్తున్నామని శాసన సభాపతి సి హెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో నిర్మించిన అనెక్స్ భవనాన్ని మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణలతో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, దాదాపు 14వేల చదరపు అడుగుల పని ప్రదేశం అందుబాటులోకి వచ్చిందని, పత్రికా సమావేశాలకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

-------------------------

రాష్ట్రంలో నూతన వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల నిర్మాణానికి చర్యలు చేపడతామని వ్యవసాయ

శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్ర వర్షాకాల సమావేశాల్లో భాగంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధ్యానమిస్తుందని అచ్చెన్నాయుడు తెలియజేస్తూ,

వాయిస్ .. 34 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు వస్తు సేవల పన్ను – జీఎస్టీ సవరణలు దోహదపడతాయని రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. నూతనంగా అమలులోకి వచ్చిన జీఎస్టీ విధానం ద్వారా వాహనాల అమ్మకాలు పెరిగాయని ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా 2 వేల 991 వాహనాలు తాత్కాలిక రిజిస్ట్రేషన్లు నమోదైయ్యాయని వెల్లడించారు. కొత్త పన్ను విధానం ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచుతుందని పేర్కొన్నారు.

---

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. “సేవా పర్వ్” పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. వ్యవసాయంలో సాంకేతికత అమలు గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01 : 31 )

---

తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ ఉదయం తిరుమలలో చిన్నశేష వాహనసేవ వాహనంపై మలయప్పస్వామి వేణుమాధవుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహనసేవలను తిలకించేందుకు భారీగా భక్తులు తిరుమలకు తరలివచ్చారు. ఈ రోజు సాయంత్రం స్వామివారికి హంసవాహన సేవ నిర్వహించనున్నారు.

---

విజయవాడలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మిశ భక్తులతో కలిసి క్యూలైన్లో వెళుతూ వారితో మాట్లాడి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు క్యూలైన్లలోని భక్తులకు మంచినీరు, పాలు వంటివి పంపిణీ చేస్తున్నామన్నారు.

---

పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యాన్ని తెలియజేసేలా స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. ‘స్వచ్ఛతా హీ సేవా’ కార్యక్రమాల్లో భాగంగా అనంతపురంలోని కక్కలపల్లి

కాలనీలలో నిర్వహించిన ఏక్ దిన్ ఏక్ ఘంట ఏక్ సాథ్ – ఒక రోజు, ఒక గంట, అందరూ కలిసి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఇందులో భాగంగా స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ,

వాయిస్.. 27 సెకన్లు

---------------------------

దేశంలో పేదలను సముద్ధరించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈరోజు అంత్యోదయ దివస్ నిర్వహిస్తున్నారు. అంత్యోదయ అంటే పేదల సంక్షేమం. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కాంక్షించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. భారత దేశంలో ప్రభావవంతమైన నాయకులలో ఒకరు, జన సంఘ్ వ్యవస్థాపకులు అయిన దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని అంత్యోదయ దివస్‌గా నిర్వహిస్తున్నారు. పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫరే పట్టణానికి సమీపంలోని చంద్రభాన్ గ్రామంలో 1916వ సంవత్సరం సెప్టెంబర్ 25వ తేదీన జన్మించారు. సమాజంలో పేదల అభ్యున్నతి కోసం ఆయన ఆవిరళ కృషి చేశారు.

---------------------------

వాయవ్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం పశ్చిమ దిశగా కదులుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ..

..వాయిస్.. 23 సెకన్లు

======================